క్లుప్తంగా

వెటరన్ అథ్లెట్‌కు సాయం



వెంకటరావుకు సాయం అందిస్తున్న వాలీబాల్ క్రీడాకారులు

తగరపువలస: ప్రముఖ వెటరన్ అథ్లెట్ మామిడి వెంకటరావుకు భీమిలి వాలీబాల్ క్రీడాకారులు సోమవారం రూ.4 వేలు అందించారు. ఇటీవల చిట్టివలస బంతాట మైదానంలో మహా శివరాత్రి సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. మూడో స్థానంలో నిలిచిన భీమిలి వాలీబాల్ క్రీడాకారులు తమకు వచ్చిన ప్రైజ్ మనీని వెంకటరావు వైద్య ఖర్చుల కోసం అందించారు. కార్యక్రమంలో బోర శ్రీనివాసరెడ్డి, వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జబర్దస్త్ నటుల సందడి



పీఎంపాలెంలో జబర్దస్త్ నటులు

కొమ్మాది: పీఎం పాలెం చివరి బస్టాప్ సమీపంలో జబర్దస్త్ నటులు దుర్గారావు, వరాలబాబు, దర్శకుడు పోతిన రమేష్ సందడి చేశారు. విజయనగరంలో జరగనున్న ఓ ఉత్సవానికి వెళ్తున్న తరుణంలో ఇక్కడి ఓ స్నేహితుడిని కలిసేందుకు చేరుకున్నారు. వీరితో స్థానికులు సెల్ఫీలు తీసుకుని సంబరపడ్డారు.

టీడీపీ నాయకుల ప్రచారం



చంద్రంపాలెం హైస్కూల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న రాజబాబు తదితరులు

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి చిరంజీవిరావును గెలిపించాలని ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు తదితరులు సోమవారం ప్రచారం నిర్వహించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు పరిసర ప్రాంతాల్లోని గ్రాడ్యుయేట్స్‌ని, ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని కోరారు. మొల్లి లక్ష్మణ, వాండ్రాసి అప్పలరాజు పాల్గొన్నారు.

తగరపువలస: పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు తరపున ఒకటో వార్డులో పిట్ట సురేష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. వివిధ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులను కలిశారు. చిలకా నరసింగరావు, చోడిపల్లి జై సాయికుమార్, వానపల్లి సత్యనారాయణ, మద్దుల దేవుళ్లు, మద్దిల సుబ్బారావు, తాటిపూడి అప్పలరాజు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రం కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న దళిత సంఘాల ఐక్య వేదిక సభ్యులు

పద్మనాభం: మండలంలోని బాందేవపురం ఎస్సీ కాలనీకి చెందిన దెందేటి మంగమ్మకు కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద భీమునిపట్నం నియోజకవర్గం దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. మంగమ్మపై దాడి చేసిన సాగి కృష్ణమూర్తి రాజును అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. వీఆర్వో ఈ నెల 24న మంగమ్మ నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి బాగం గోపాలరావు తెలిపారు. అయితే ఆ స్టేట్‌మెంట్ సరిగా లేదని కేసు నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బి.లక్ష్మి, జి.కృష్ణ పాల్గొన్నారు.

తీరని మార్కెట్ కష్టాలు



నిరుపయోగంగా ఉన్న షాపులు



మార్కెట్‌లో పూర్తిగా పాడైపోయిన షెడ్లు

- శిథిల స్థితిలో కూరగాయల మార్కెట్ షెడ్లు
- ముందుకెళ్లని ఆధునికీకరణ ప్రతిపాదనలు

భీమునిపట్నం: భీమిలి పెద్దబజారులోని కూరగాయల మార్కెట్‌లో షెడ్లు పూర్తిగా పాడైపోయి వినియోగించలేని స్థితికి చేరుకున్నాయి. ఇక్కడ విశాలంగా ఉన్న షెడ్లలో కూరగాయలు, మాంసం, చేపలు అనేక సంవత్సరాలుగా విక్రయించేవారు. ఈ క్రమంలో గత పదేళ్లలో వీటి మరమ్మతులను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పూర్తిగా పాడైపోయాయి.

షెడ్లపై ఉన్న రేకులు విరిగిపోవడంతో వాటిలో అమ్మకాలు చేయడానికి వ్యాపారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షాలు కురిసే సమయాల్లో మార్కెట్ మొత్తం బురదగా మారడంతో కొనుగోలుదారులు లోనికి వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది.

షాపులు నిర్మించినా ప్రయోజనం శూన్యం

మార్కెట్‌లోని షెడ్లకు మరమ్మతులు చేపట్టి ఆధునికీకరించేందుకు అధికారులు గత నాలుగు సంవత్సరాల నుంచి అంచనాలు సిద్ధం చేస్తున్నామని చెబుతున్నా ఇప్పటి వరకూ ఎటువంటి కదలికా లేదు. దీంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఇదిలా ఉండగా ఆరు సంవత్సరాల క్రితం మార్కెట్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో రూ.20 లక్షలతో చిన్న షాపులు నిర్మించారు. తద్వారా సగం మంది వ్యాపారులు వాటిల్లో విక్రయాలు చేసుకోవడానికి వీలు కల్పించారు. అయితే ఆ వ్యాపారులు షాపుల్లోకి మారకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. వారిని ఒప్పించి తరలించడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఖాళీగా ఉన్న షాపులు మందుబాబులకు నిలయంగా మారాయి. దీనివల్ల మార్కెట్‌లోకి వెళ్లేందుకు మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే చాలా మంది మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, పళ్లు, పువ్వులు విక్రయిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అయినప్పటికీ అధికారులు మాత్రం కనీసం పట్టించుకోకుండా వదిలేశారు. ఇప్పటికైనా స్పందించి షెడ్లకు మరమ్మతులు చేపట్టడంతోపాటు షాపుల్లోకి వ్యాపారులను తరలించాలని, ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో సమస్య పరిష్కరిస్తాం



ఇక్కడ గతంలో షాపులను కేటాయించిన వ్యాపారులు అందులో అమ్మకాలు సాగించేలా చర్యలు చేపడతాం. మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా దెబ్బతిన్న ప్రధాన మార్కెట్‌లో కొత్త షెడ్ల నిర్మాణం కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– బొడ్డేపల్లి రాము, జోనల్ కమిషనర్

సాంకేతికతతో బోధిస్తే మరింత ప్రయోజనం



బోధన విధానాన్ని ఉపాధ్యాయులతో కలిసి తిలకిస్తున్న డీఈవో చంద్రకళ

భీమునిపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌నెట్ సదుపాయం కల్పిస్తామని, దాన్ని ఉపాధ్యాయులు తగినమేరకు వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సూచించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ఉపాధ్యాయులతో సోమవారం ఇక్కడి జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరిన్ని సాంకేతిక వనరులను కూడా కల్పిస్తారని, వాటి ద్వారా విద్యార్థులకు బోధిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్పొరేట్ విద్య విధానానికి దీటుగా అందిస్తున్న ఈ సదుపాయాల వల్ల పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అద్భుత ప్రతిభ ప్రదర్శించి మంచి స్థితికి చేరుకుంటారన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులందరూ తగిన తర్ఫీదు పొంది చక్కగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణం తొలగించకుంటే చర్యలు

మధురవాడ: జీవీఎంసీ 7 వార్డు మధురవాడ టైలర్స్ కాలనీలో నివాసాల మధ్య నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణాన్ని వెంటనే తొలగించాలని జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి ఆదేశించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా సోమవారం సాయంత్రం టైలర్స్ కాలనీలో ఉన్న స్క్రాప్ దుకాణాన్ని ఆమె పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఈ దుకాణం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు చెప్పడంతో తొలగించాల్సిందేనని ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే దుకాణ యజమానికి నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో గోస్తనీ నదిలో ఇసుక తవ్వకాలను నిర్మూలించాలని వార్డు మెంబర్ మహంతి అప్పలరమణ సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ తవ్వకాల వల్ల బంగారమ్మ ఉత్సవాలు జరుపుకునే ప్రదేశానికి, శ్మశాన వాటికకు, లో లెవెల్లో ఉన్న కాజువేకు నష్టం వాటిల్లే ప్రమాదముందని అందులో పేర్కొన్నారు. ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లతో ఇసుక తరలించుకుపోతున్నారని ఆరోపించారు. పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం గ్రామానికి జి.కుమారి, జి.నాగమణి తమకు ప్రభుత్వమే జగనన్న కాలనీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

గోస్తనీ కాలువపై కుంగిన కాజ్‌వే



సంగివలస - పాండ్రంగి మార్గంలో గోస్తనీ కాలువపై కుంగిన రహదారి



కుంగిన గోతిలో తాత్కాలికంగా కప్పిన డెబ్రిస్

తగరపువలస: సంగివలస జాతీయ రహదారి నుంచి భీమిలి మండలం తాటితూరు, పద్మనాభం మండలం పాండ్రంగి, ఆనందపురం మండలం బోని మీదుగా విజయనగరం – సింహాచలం రోడ్డు వరకు ఉన్న రహదారి పలుచోట్ల శిథిలమైపోయింది. ముఖ్యంగా సంగివలస శివారులో గోస్తనీ కాలువపై కాజ్‌వే ఏడాది క్రితం కుంగిపోయింది. లారీ కార్మికులు తాత్కాలికంగా డెబ్రిస్‌తో దీనిని పూడ్చివేసి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో కాజ్‌వే కింద నుంచి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. విజయనగరం జిల్లాలోని అలమండ, జామి, ఎస్.కోట, కొత్తవలస గ్రామాలకు వెళ్లాలనుకునే వారు పెందుర్తి, విజయనగరం మీదుగా రహదారులు ఉన్నాయి. వీటితో పోలిస్తే సంగివలస – పాండ్రంగి – మద్ది రహదారి మీదుగా మార్గం తక్కువ కావడంతో పాటు ప్రయాణికులకు సమయం, డబ్బులు ఆదా అవుతాయి. అందువల్ల సొంత వాహనాలు కలిగిన వారు ఈ మార్గాన్నే అనుసరిస్తుంటారు. కానీ ఈ మార్గంలో వందలాది ఇటుక బట్టీలు ఉండడంతోపాటు గోస్తనీనది నుంచి దొడ్డిదారిన ఇసుక తరలించాలనుకునేవారు భారీ వాహనాలతో ఈ రహదారిని ఎంచుకుంటున్నారు. దీంతో చాలా వరకు సంగివలస – పాండ్రంగి – మద్ది రహదారి శిథిలమైంది. 2014లో సంభవించిన హుద్‌హుద్‌కు సంగివలస వద్ద గోస్తనీ కాలువ పూర్తిగా కొట్టుకుపోయి 20 మీటర్ల మేరకు గొయ్యి ఏర్పడింది. అప్పట్లో కాజ్‌వే పునర్నిర్మించినా నాణ్యత లేకపోవడంతో ఏడేళ్లకే శిథిలమైపోయింది. భారీ వాహనాల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని ఈ కాజ్‌వేను నాణ్యతతో మళ్లీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

తక్కువ ఎత్తు కల్వర్టులతో అవస్థలు

జోన్ - 2 స్పందనకు 9 అర్జీలు



భీమిలిలో వినతి స్వీకరిస్తున్న జెడ్సీ రాము



జెడ్సీకి సమస్య వివరిస్తున్న జీసీసీ లే అవుట్ వాసులు

మధురవాడ: కాలనీలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన కల్వర్టులు తక్కువ ఎత్తులో ఉండడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారిందని, చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరు ఇళ్లల్లోకి వచ్చేస్తోందని కొమ్మాది జంక్షన్ సమీపంలో గల జీసీసీ లే అవుట్ వాసులు వాపోయారు. మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో జెడ్సీ కొట్యాడ.కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 9 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జీసీసీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సీహెచ్.సత్యనారాయణ, డి.రమణమూర్తి, సీహెచ్.శారదాదేవి, బి.దేముడు తదితరులు గెడ్డ, పక్కా రోడ్ల కోసం వినతిపత్రం ఇచ్చారు. జీవీఎంసీ 5, 6 వార్డులకు చెందిన మురుగునీరు ఈ కాలనీలోని 25 నుంచి 31, 39, 44 నుంచి 47 మరియు 111 ప్లాట్ల మధ్య నుంచి ప్రవహిస్తుందన్నారు. ఇప్పటికైనా గెడ్డ పక్క గోడలు ఎత్తుచేసి మురుగునీటి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

- మధురవాడ టైలర్స్ కాలనీలో నివాసాల మధ్య స్క్రాప్ దుకాణం ఏర్పాటు చేయడం వల్ల దుర్వాసన, ఈగలు, దోమలతో పరిసర ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారని... తక్షణమే చర్యలు చేపట్టాలని మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు టి.ప్రదీప్ కుమార్, బెల్లాపు పాపారావు, జగన్మోహనరావు, మోహనరావు, ఆషా స్వరూప్, బీఎస్ రావు ఫిర్యాదు చేశారు.
- పీఎం పాలెం క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది జంక్షన్ మధ్య జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీని శుభ్రం చేయాలని సీఐటీయూ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్ తదిరులు కోరారు.
- చలమాజీ హైట్స్ అపార్ట్‌మెంట్ గేటు నుంచి మెయిన్ రోడ్డు వరకు కనెక్టింగ్ సీసీ రోడ్డు నిర్మించాలని అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వరాజ్యం, కార్యదర్శి రత్నకుమారి కోరారు. ఈ సమస్యలపై తక్షణమే చర్యలు చేపడతామని జెడ్సీ కనక మహాలక్ష్మి హామీ ఇచ్చారు.

వినతులు వెంటనే పరిష్కరించాలి

భీమునిపట్నం: స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆదేశించారు. సోమవారం స్పందనలో పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజినీరింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి 11 వినతులు వచ్చాయి. జాప్యం చేయకుండా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. పారిశుధ్య విభాగం అధికారి బి.మహాలక్ష్మినాయుడు, టౌన్‌ప్లాంగ్ అధికారి జాన్సీ, పబ్లిక్ వర్క్స్ ఏఈ సుమన్ పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్ విజయమే లక్ష్యం



చిట్టివలసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అభివృద్ధి, సంక్షేమ పథకాల పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కాపులుప్పాడలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు, నాయకులు



భీమిలి బీచ్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సంతపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

కొమ్మాది: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ కోరారు. జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెంలో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించారు. పార్టీ తరపున పోటీ చేస్తున్న సుధాకర్‌కు మంచి వ్యక్తిగా పేరుందని, ఎమ్మెల్సీగా గెలిపించి పెద్దల సభకు పంపించడం ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. నియోజకవర్గంలో భారీ మెజారిటీ వచ్చే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల, మతాలు, పార్టీలతో సంబంధం లేకుండా అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ విజయానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, జేసీఎస్ కో ఆర్డినేటర్ ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు బుజ్జి, లొడగల రామ్మోహన్, చెన్నాదాసు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ప్రచారం చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, కన్వీనర్లు దేవాడ నాయుడు రెడ్డి, సాడి రమణ, రామకృష్ణ, మేరుగు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా సుధాకర్ గెలుపునకు కృషి

భీమునిపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు పార్టీలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఇక్కడి తన క్యాంపు కార్యాలయంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో ఈ గెలుపు ఎంతో ప్రతిష్ఠాత్మకమైందని, సీఎం జగన్ మోహన్‌రెడ్డి కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఇప్పటికే మూడు జిల్లాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని, సుధాకర్‌ను గెలిపిస్తే మరింత మంచి జరుగుతుందన్నారు. పట్టభద్రులకు సచివాలయాల్లో వేలాది ఉద్యోగాలతోపాటు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో వారికి ఎన్నో విధాలుగా ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. విశాఖ రాజధానికి సంబంధించి ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టడంతోపాటు అపోహలు తొలగించాలని సూచించారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పీఎం పాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. బేతనీ పాఠశాలలో సోమవారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 6, 7 వార్డుల అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, కె.వరలక్ష్మి, రజిని, సూరిబాబు, కృష్ణమూర్తి పాత్రుడు పాల్గొన్నారు.

- తగరపువలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తరపున ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలిలో సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బీచ్‌రోడ్డుతోపాటు భీమిలిలోని వివిధ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులను కలిసి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఆయనతోపాటు నాయకులు అల్లిపల్లి నరసింగరావు, మైలపల్లి షణ్ముఖరావు, వాసుపల్లి కొండబాబు, గుండాసి మధునాయుడు, వాసుపల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ ఒకటో వార్డు పరిధిలో చిట్టివలస, బంగ్లామెట్ట, తగరపువలసలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, కుంచా శివరామకృష్ణ, జీరు సుజాత, తమ్మిన కూర్మారావు, వెంపాడ వెంకటరమణ, కొప్పల కృష్ణ, సిమ్మల ప్రసన్న, తమ్మిన నరసింగరావు, దుంప సాయిరెడ్డి తదితరులు ప్రచారం చేశారు.
- జీవీఎంసీ రెండో వార్డు సంతపేట, ఆదర్శనగర్, చిల్లపేటలో వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, పార్టీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, శిల్లా వంశీ, బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, మునకాల ఆదినారాయణ రెడ్డి, నీలాపు సురేష్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, సరగడ నాగిరెడ్డి, చిల్ల సూరినరసయ్య, చేట్ల ఎల్లయ్యరెడ్డి ఓటర్లను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ లచ్చుభుక్త రామారావు ఇటీవల మృతి చెందడంతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నిక జరగనుంది. ఈ మేరకు సోమవారం గ్రామ సచివాలయంలో కార్యదర్శి సత్యసుధ ఓటర్ల జాబితా ప్రదర్శించారు. పంచాయతీలో 2,258 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే టి.నగరపాలెం పంచాయతీలో 10వ వార్డు సభ్యుడు కోరాడ సూరిబాబు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయగా ఆ స్థానానికి ఎన్నిక జరగనుంది. ఇక్కడి వార్డులో 166 మంది ఓటర్లు ఉన్నారు.

టెక్ సదస్సు ప్రారంభం

కొమ్మాది: గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఫర్ డిగ్రీ, పీజీ కోర్సుల విద్యార్థుల టెక్ నిర్వహణ – 2023 సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఇంజినీరింగు టెక్నాలజీ ప్రోగ్రామ్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగు విభాగం మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ సదస్సును పవర్ గ్రిడ్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఏవీఎల్ నర్సింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగంలో ఆవిష్కరణలు, వాటి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రజని తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ సీతారాం మృతి



తగరపువలస: భీమిలి మున్సిపాల్టీ మాజీ కౌన్సిలర్ కొండపు సీతారాం(80) అస్వస్థత కారణంగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం సంతపేటలో అతని ఇంటి వద్ద మృతి చెందారు. 1981 – 82లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పనిచేశారు. క్వారీ లారీ కార్మికుల సలహాదారునిగా కూడా పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ మారికవలస ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొమ్మాది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సంతోష్ కుమార్ చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మారికవలస గ్రామం, మారికవలస జంక్షన్, టయోటా షోరూమ్, బిస్లరీ వాటర్ కంపెనీ, బోరవానిపాలెం, మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ ఆర్ జీకే కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, జేకే లే అవుట్, డంపింగ్ యార్డు, డ్రైవర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామాభివృద్ధిపై చర్చకు ఆహ్వానం

తగరపువలస: చిట్టివలస శ్మశానవాటిక, గ్రామాభివృద్ధిపై చర్చించడానికి మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణమండపంలో సమావేశం ఏర్పాటు చేశారు.

వీటిపై చర్చించేందుకు సంతపేట, కొత్తపేట, విల్సన్‌పేట, కొండపేట, హరిజన సంతపేట, రజక సంతపేట, ఆదర్శనగర్, వెలంపేట, గొల్లవీధి ప్రజలు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు చెప్పల పంపిణీ



గెద్దపేటలో చెప్పలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో సోమవారం లెప్రా సొసైటీ సమకూర్చిన చెప్పులను 25 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు, ఐదుగురు ఫైలేరియా బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకుడు కోండ్రోతు శ్రీనివాసరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లెప్రా సొసైటీ ఫిజియో థెరపిస్టు ఎ.అఖిల, బీఎఫ్‌డీటీ రీచ్ మీ ప్రాజెక్టు జిల్లా కో ఆర్డినేటర్ గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సరకులు అందజేత

పద్మనాభం: మండలంలోని పెంటలో మృతుడు దాసరి సత్తిబాబు కుటుంబానికి మాతృభూమి సేవా సంఘం, హేండ్స్ సొసైటీ సంయుక్తంగా నిత్యావసర సరకులు సోమవారం పంపిణీ చేశారు. మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఐ.గోపాలరావు, హేండ్స్ సంస్థ ప్రతినిధులు సొంగ మనోజ్, సురేష్ తదితరులు సరకులను మృతుని భార్య కొండమ్మకు అందజేశారు.